క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కంబాలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ నాయక్ అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకట్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్‌నాయక్, ఆశ కార్యకర్త సుభద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టా భూముల పంపిణీలో నిర్లక్ష్యం

నెల్లికుదురు: ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చిన భూమిని పంపిణీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండలంలోని రామన్న గూడెం లబ్ధిదారులు మైస రాములు, మొగుల గాని నర్సయ్యతోపాటు మరి కొంతమంది సోమవారం తహసీల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. కార్యాలయంలో ఆర్‌ఐ యాకూబ్ పాషాకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలోమైస రాములు, మొగులగాని నర్సయ్య, వెంకన్న, సోమయ్య, వెంకటేష్, అశోక్, వెంకన్న, భిక్షపతి, శ్రీను పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

దంతాలపల్లి: రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల అందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికల హామీల అమలు కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనువాస్, నాయకులు సారయ్య, కృష్ణ, జనార్దన్, మురళి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా పోతురాజు



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన గుండ రాజశేఖర్(పోతురాజు)ను నియమించామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్కర్సు ప్రభాకర్‌వర్మ సోమవారం తెలిపారు.

భూములు లాక్కోవద్దు



మహబూబాబాద్: ప్రభుత్వ అవసరాలకు కేవలం సాలార్‌తండా భూములను లాక్కోవడం సరికాదని తండావాసులు అనసూర్య, పద్మ, రమేష్, సురేందర్, వెంకన్న అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టరేట్, హరితహారం, రోడ్డు, ఇతర అవసరాలకు సాలార్‌తండా భూములనే లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కోసం భూములు తీసుకున్న సమయంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని మండిపడ్డారు. మళ్లీ సబ్ స్టేషన్ నిర్మాణం, పలు సర్వేల పేరుతో నానా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కొందరు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వార్డుకు రూ.కోటి కేటాయించాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.50కోట్లలో వార్డుకు కోటి రూపాయలు కేటాయించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 22వ వార్డు కౌన్సిలర్ బీ.అజయ్‌సారథిరెడ్డి, 36 వార్డు కౌన్సిలర్ నీరజారెడ్డి ధర్మన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు.. మూడు సంవత్సరాల కాలంలో నామ మాత్రం వచ్చిన నిధులతో పూర్తిస్థాయిలో పనులు జరగలేదని కొంత మేర రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు మాత్రమే చేశామన్నారు. పట్టణ ప్రగతి, 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల విషయంలో ఉన్న నిబంధనల వల్ల కొన్ని పనులకు కేటాయించే పరిస్థితి లేదని, నిధులు విషయంలో అన్నివార్డులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21 జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశ పెట్టి తీర్మానం చేయాలన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



నెల్లికుదురు: మట్లాడుతున్న ప్రత్యేక అధికారి సూర్యనారాయణ

నెల్లికుదురు: త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి 10/10 జీపీఏతోపాటు 100శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ విద్యార్థులకు సూచించారు. ఎంఈఓ గుగులోతు రాము ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి వార్షిక పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఉత్తములుగా తీర్చిదిద్దడాని మీకోసం ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు పడుతున్న తపన చూస్తున్నారని అన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించడం సులభతరమన్నారు. పరీక్షల పట్ల భయం తొలగి నిర్భయంగా పరీక్షలు రాసేందుకు, ఆరు పత్యాంశాలపై నిష్ణాతులైన ఉపాధ్యాయులచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వర రావు, ఎంపీడీఓ శేశాద్రి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఖలీద్ అహ్మద్, వెంకటేశ్వర్లు, గంగాధర్‌స్వామి, రమేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రం: ప్రతి విద్యార్థి ఇష్టంతో చదవాలని నోడల్ హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వార్షిక పరీక్షలపై ఉన్న భయాన్ని వీడాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బత్తిని రాజేందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శాంతకుమారి, కాలేరు యాదగిరి, రిసోర్స్ పర్సన్‌లు బండారు నరేందర్, సత్యనారాయణ, రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న హెచ్‌ఎం జగన్మోహన్‌రెడ్డి

దంతాలపల్లి: మండలంలోని గల వివిధ పాఠశాలలలో 10వ తరగతి చదువుతన్న విద్యార్థులకు మండల కేంద్రంలో గల బాలాజీ ఫంక్షన్ హాలులో సోమవారం వార్షిక పరీక్షలపై ఆయా సబ్‌జెక్టు నిపుణులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ క్వాలిటీ కోఆర్డినేటర్ మహంకాళి బుచ్చయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అజయ్‌సింగ్, శంకరయ్య, చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్ల అందజేత

తొర్రూరు: స్థానిక కౌన్సిలర్ కొలుపుల శంకర్ చేయూతతో డివిజన్ కేంద్రంలోని 15వ వార్డు అంగన్‌వాడీ కేంద్రానికి వేయింగ్ మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ గజానంద్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల ఉన్నత పాఠశాలను సోమవారం రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు పలు రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అజయ్‌సింగ్, శంకరయ్య, బుచ్చయ్య, కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ బోయినపల్లి గిరిజన వాటర్ స్పోర్ట్స్ కోఎడ్యూకేషన్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అధికారి ఎర్రయ్య సోమవారం తెలిపారు. నేరుగా కొత్తగూడ మోడల్ పాఠశాలకు ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను, ఒరిజనల్ ధ్రువపత్రాలను ఈనెల 25వరకు అందజేయాలన్నారు.

భూమి డబ్బులు చెల్లించాలని నిరసన



నిరసనలో మాట్లాడుతున్న భీమానాయక్

మహబూబాబాద్ రూరల్: అమ్మిన భూమికి సంబంధించిన డబ్బులు చెల్లించాలని కోరుతూ మండలంలోని దామ్యతండాకు చెందిన బానోత్ గణేష్ అనే రైతు సోమవారం అదే గ్రామ శివారులో నిరసన తెలిపారు. ఇందుకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ భీమానాయక్ మద్దతు తెలిపి మాట్లాడారు. బానోత్ గణేష్‌కు సంబంధించిన భూమి సర్వేనంబర్ 398/30లో 4ఎకరాల మొత్తాన్ని ఒకరికి అమ్మాడన్నారు. అమ్మిన దానిలో ఇప్పటి వరకు రూ.50లక్షలు చెల్లించగా మిగిలిన రూ.49లక్షలు ఇవ్వకుండా రెండేళ్లుగా తిప్పుతున్నారన్నారు. డబ్బులు అడిగేందుకు వెళ్తే భయభ్రాంతులకు గురిచేస్తూ వేదిస్తున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపించి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్, సుధాకర్, కిరణ్, శ్రీనివాస్, రాందాస్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరం ప్రారంభం

మరిపెడ రూరల్: అంధత్వ సమాజ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. మరిపెడ మండలం చింతలగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలో మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో విడుత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం ఎంపీపీ, జెడ్పీటీసీ తేజావత్ శారదతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు పాకనాయక్, రాజునాయక్, ఎంపీటీసీ కొంపెల్లి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి అనురాధ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బాల్య వివాహం అడ్డగింత

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో బాలిక వివాహ ఏర్పాట్లను సోమవారం అధికారులు అడ్డుకున్నారు. ఈనెల 24న వివాహం జరగనుందని తెలుసుకున్న ఆర్‌ఐ బానోత్ రామా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ, సర్పంచ్ బొబ్బా లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమేష్, చైల్డ్‌లైన్ ప్రతినిధి ఖాజాబి తదితరులు బాలిక ఇంటికి వెళ్లారు. బాల్య వివాహం చేయరాదంటూ బాలిక తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనారిటీ తీరేంత వరకు వివాహం చేయరాంటూ తండ్రి నుంచి హామీ పత్రం తీసుకున్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పదంగా మహిళ మృతి

తొర్రూరు రూరల్: వ్యవసాయ పొలం వద్ద ఓ వివాహిత మహిళ జాటోతు సునీత(35) అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని నాంచారీమడూరు గ్రామశివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక రైతుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



వెంకటలక్ష్మి

గార్ల: వివాహితపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపారు. గార్ల మండలం కొత్తపోచారం గ్రామంలో పొన్నెగంటి వెంకటలక్ష్మితో అదే గ్రామానికి చెందిన రామకృష్ణతో గత 4ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కాగా వెంకటలక్ష్మి పోచారం గ్రామంలో 2నెలల నుంచి తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. భర్త రామకృష్ణ భద్రాచలంలో ఉంటూ టైలరింగ్ పనిచేస్తూ వారానికి ఒకసారి భార్య వద్దకు పోచారం వచ్చి వెళ్తుంటాడు. ఈనెల 18న వెంకటలక్ష్మి గ్రామంలోని కిరాణం దుకాణంకు సరుకులు తెస్తానని వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల ఇళ్లలో, బంధువుల వద్ద వెతికనా ఆచూకీ లభ్యం కాలేదు. ఈమేరకు భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. జీపీ కార్యదర్శికి గాయాలు

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల సెయింట్ మేరీ ప్రైవేట్ పాఠశాల బస్సు బైకును ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన కొండ రామ్మూర్తి (32)మరిపెడ మండలం నీలికుర్తి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులకు వెళ్తున్న క్రమంలో చారితండా క్రాస్‌రోడ్డు వద్ద సెయింట్ మేరీ ప్రైవేట్ పాఠశాల బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండలో ఆస్పత్రికి తరలించారు. అతని భార్య హిమబిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ఎస్ కె.మదార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసీఆర్‌ను గద్దె దించడమే బీజేపీ లక్ష్యం



గార్ల: మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

గార్ల: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే బీజేపీ పార్టీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పోచారం గ్రామంలో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్‌జైన్, నియోజకవర్గ కన్వీనర్ బీ.గోపికృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధి రామచంద్రు నాయక్, జిల్లా కార్యదర్శి రుద్రయ్య, మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్ పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబానికే లబ్ధి

డోర్నకల్: తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ కుటుంబానికే సింహభాగం లబ్ధి చేకూరిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. స్థానిక సుభాష్‌వీధిలో సోమవారం జరిగిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మహేష్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూర్ణచందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బాసాని నాగేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు దేవా, శక్తి కేంద్రం అధ్యక్షుడు వెంకటమనోహర్, మండల ఇన్‌చార్జ్ పెంటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

కేసముద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సబ్‌స్టేషన్‌తండా, రేకులతండాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శక్తికేంద్రం ఇన్‌చార్జ్ సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాదిల నర్సింహరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శులు గాంతి వెంకట్‌రెడ్డి, నాగేశ్వరాచారి, రాంబాబు, శోభన్, రాజు, భిక్షం పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అంజయ్య

తొర్రూరు: ప్రతీ మూడు నెలలకోమారు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సోమవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య అధ్యక్షతన మండల సభ నిర్వహించారు. జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీడీఓ సింగారపు కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్న సభలో మండల సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నలు లేవనెత్తగా అధికారులు సమాధానమిచ్చారు. మెజార్టీ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండల అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని, రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు కృషితో మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎంపీపీ అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్‌రెడ్డి, తహసీల్దారు నాగేంద్రప్రసాద్, ఎంపీఓ గౌస్, ఏఓ కుమార్‌యాదవ్, వైద్యాధికారి మీరాజ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

గూడూరు: ట్రైబల్ జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తేజావత్ రవినాయక్, లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం మార్చి 5న జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభ విజయవం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, ప్రమోద్, మంగీలాల్, నరసింహా పాల్గొన్నారు.

అమావాస్య అన్నదానం

మరిపెడ: మరిపెడ వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు మరిపెడ ప్రాజెక్ట్ చైర్మన్ వుప్పల ఉదయ భాస్కర్ నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, వంగపల్లి భరత్, దారం నాగేశ్వర్ రావు, శ్రీరంగం శ్రీనివాస్, వుల్లి శ్రీనివాస్, రాంబాబు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో సర్వే నంబర్లు 278/ఏ/4/2తో పాటు పలు సర్వే నంబర్లలో సుమారు రెండు ఎకరాల భూమిలో లేఅవుట్ అనుమతి తీసుకుని ప్లాట్లు చేసి వాటిలో గృహ నిర్మాణాలు చేశారు. కాని గ్రీన్‌ల్యాండ్‌గా గుట్టను కేటాయించారని దానిపై విచారణ చేసి యాజమాన్యంపై చర్య తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ హరిసింగ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు.

రేపు వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 22వ తేదీ బుధవారం రోజున బహిరంగ వేలం వేస్తున్నామని ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ సోమవారం తెలిపారు.

క్రీడా పరికరాల బహూకరణ

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల కాంటిజెన్సీ నిధులతో కొనుగోలు చేసిన క్రీడా పరికరాలను సోమవారం హెచ్‌ఎం మరియా మాణిక్యం విద్యార్థుల సమక్షంలో పీడీ శ్యాంబాబుకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, అప్పిరెడ్డి, సునీల్, కమల, మాధవరావు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లను తొలగించాలి

గార్ల: ఏజెన్సీ మండల కేంద్రమైన గార్లలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి అక్రమ వెంచర్లు నిర్వహిస్తున్న గిరిజనేతరులపై చర్య తీసుకోవాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ అశోక్ తహసీల్దార్ రాముకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు రమేష్‌నాయక్, సురేష్, తదితరులు ఉన్నారు.

బహుమతులు అందజేత

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం మండలస్థాయి సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం విజేతలకు హెచ్‌ఎం మరియామాణిక్యం బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, భిక్షపతి, రామకృష్ణ, దేవేందర్, సునిల్, శ్యాంబాబు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

గూడూరు: ప్రజాప్రస్థాన యాత్రలో భాగంగా మానుకోటకు విచ్చేసిన వైఎస్ షర్మిల ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, ఎంపీ కవితపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు లకావత్ రాంచందర్ నాయక్ సోమవారం అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, లచ్చు, క్రిష్ణ, బాలు, భద్రు, పూల్‌సింగ్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు చేయాలి

గార్ల: కంటి వెలుగు కేంద్రాల్లో టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులను సైతం అనుమతించి కంటి పరీక్షలు చేయాలని పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు సతీష్, వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు

దందాపై విచారణ జరపాలి

డోర్నకల్: గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తామంటూ డబ్బు వసూలు చేయడంపై విచారణ జరపాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.విజయకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై గ్రీవెన్ సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఉపేందర్, అరుణ్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నూతనంగా షిర్డీ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కల్పించారు. సోమవారం షిరిడీ ఎక్స్‌ప్రెస్ కేసముద్రం రైల్వేస్టేషన్‌కు డౌన్‌లైన్‌లో మొదటిసారి చేరుకున్న సందర్భంగా, స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు ఘనస్వాగతం పలికారు. బీజేపీ నాయకుడు వోలం శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత

గూడూరు: మండలంలోని మధనాపురం శివారు బీర్బల్‌తండాకు చెందిన నిరపేద అయిన భూక్య పూల్‌సింగ్ కూతురు పెళ్లి సందర్భంగా ఒక్కరు మారినా చాలూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపినాథ్, సర్పంచ్ కట్ల భవానివిష్ణుగౌడ్, లక్ష్మన్ నాయక్ సహకారంతో సోమవారం క్వింటా బియ్యాన్ని అందించారు.

నేడు తెప్పోత్సవం

కురవి: భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదోరోజు మంగళవారం కురవి పెద్దచెరువు వద్ద తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలకవర్గం ఏర్పాట్లు చేశారు. సోమవారం పెద్దచెరువు కట్ట పరిసరాలను పరిశుభ్రం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ మండల నాయకులు మురళీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ పట్ల సలీమా గంగన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో యజ్ఞం

మహబూబాబాద్ రూరల్: అమావాస్య సందర్భంగా జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దాసరోజు సందీప్‌శాస్త్రి ఆధ్వర్యంలో పలువురు దంపతులు, భక్తులు పాల్గొని హనుమాన్ యజ్ఞంలో ఆహుతులు సమర్పించారు.

మానవ మనుగడకు మొక్కలు అవసరం

గూడూరు: పచ్చని మొక్కలు, చెట్ల ద్వారా వచ్చే ఆక్సీజన్ సకల కోటి మానవాళికి జీవనాధారం అవుతుందని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత, వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య అన్నారు. మండలంలోని గుండెంగలో సోమవారం మాజీ ఉపసర్పంచ్ కందిక స్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అశోక్ సమక్షంలో స్వామి విగ్రహ ఆవరణలో అల్లనేరడు, వెలుగ, కొబ్బరి, పండ్లు, పూలమొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా నాయకుడు కొమురయ్య, హరీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి నిమిషం విలువైనదే..

పెద్దవంగర: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముగింపు వేడుకల్లో చేపట్టిన పాటలు, డ్యాన్సలతో సందడి నెలకింది. అనంతరం ఎస్‌ఓ ప్రవంతి మాట్లాడారు. పరీక్షల నిర్వహన దగ్గర పడుతున్నందున పదో తరగతి విద్యార్థులకు ప్రతి నిమిషం చాలా విలువైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

దంతాలపల్లి: యూరియా బస్తాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని సోమవారం వ్యవసాయ మండల అధికారులు పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు.

‘పది’ పరీక్షలో మార్పులు

- వందశాతం సిలబస్‌తో టెన్త్ పరీక్షలు
- ఈనెల 22నుంచి ప్రీఫైనల్స్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షల విధానంలో మార్పులు తీసుకువచ్చింది. గతంలో 11పేపర్లు ఉండగా.. 2019–20 సంవత్సరంలోనే మార్పు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఆలోచన చేసింది. కరోనా ప్రభావంతో సాధ్యం కాలేదు. అయితే గత ఏడాది సిలబస్ తగ్గించి ఆరు పేపర్లతో పరీక్షలు నిర్వహించింది. ఈఏడాది ఆరు పేపర్లు వందశాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రశ్నలు, చాయిస్ విధానంలో మార్పులు తీసుకొచ్చారు. ఈవిధానం తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్ట్‌లకు ఉండదు. గణితం, సైన్స్, సోషల్‌కు మాత్రమే మారిన విధానంలో ప్రశ్నపత్రం పేపర్ ఇస్తారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో భమాందళన నెలకొంది. ఈనెల 22నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్కో సబ్జెక్ట్‌లో పరీక్షలకు 80మార్కులు ఉంటాయి. 20మార్కులు అంతర్గత మార్కులు ఉంటాయి. సైన్స్ సబ్జెక్టుకు మాత్రం రెండు సమాధానాలు పత్రాలు ఇస్తారు. కాగా జిల్లాలో పది చదువుతున్న విద్యార్థులు సుమారు 8458 మంది ఉన్నారు.

మోడల్ పేపర్ ఇలా..

వ్యాసరచన ప్రశ్నలు 6 ఇస్తారు. వాటిల్లో ఏవైనా 4 రాయాలి. ఒక్కో ప్రశ్నకు 6మార్కులు చొప్పున మొత్తం 24 మార్కులు ఉంటాయి. లఘు ప్రశ్నలలు 6 ఇస్తారు. ఆరింటికి సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 4మార్కుల చొప్పున మొత్తం 24 మార్కులు ఉంటాయి. అతి లఘు ప్రశ్నలు 6ఇస్తారు. ఆరింటికి సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 2 మార్కుల చొప్పున మొత్తం 12 మార్కులు ఉంటాయి. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 20 ఇస్తారు. 20 ప్రశ్నలకు ఒక్కోమార్కు చొప్పున 20 మార్కులు కేటాయిస్తారు. మొత్తం 80మార్కులకు 36 ప్రశ్నలు ఇస్తారు. 36ప్రశ్నలకు సమాధానం రాస్తే సరిపోతుంది.

పరీక్షలు బాగా రాస్తాను

మోడల్ పేపర్‌ను కూడా ప్రతి విద్యార్థికి అందించారు. ఇప్పటి వరకు బాగానే చదువుతున్నాం. ఈసారి పరీక్షల్లో చాలా మార్పులు వచ్చాయని సార్లు చెబుతున్నారు. పది వార్షిక పరీక్షలంటేనే చాలా భయమేస్తోంది. ఎలాగైనా పరీక్షలు బాగా రాసి పదికి పది శాతం జీపీఏ గ్రేడ్ సాధిస్తాను.

– ఎస్‌కే. సమీర్, విద్యార్థి, మానుకోట

విద్యార్థులకు మంచి అవకాశం

ఈ ఏడాది పరీక్షల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఈసారి రెండు సార్లు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులకు పరీక్షలంటే భయాన్ని పోగొట్టాలి. మొదటిసారి జరిగే ప్రీఫైనల్ పరీక్షలో వెనబడుతే రెండోసారి జరగబోయే పరీక్షకు సమయాన్ని సద్వినియోగం చేసి విద్యార్థులను మెరుగుపరుస్తాం. ఇది విద్యార్థులకు మంచి అవకాశం.

– పి. రామారావు, డీఈఓ

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



డోర్నకల్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తుందని డోర్నకల్ మున్సిపాలిటీ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చైర్మన్ వీరన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం సెలూన్ దుకాణాలకు నెలకు 250యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, సెలూన్ల ఏర్పాటుకు రూ.50వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆవుదుర్తి మల్లికార్జున్, పావని వెంకన్న, సీహెచ్ వీరభద్రం, భాస్కర్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మహబూబాబాద్/కురవి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు జిల్లా కేంద్రంలో పాదయాత్ర నిర్వహించి కలెక్టరేట్‌లో వినతి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రధానంగా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానంతో 24గంటలు పని చేస్తున్నారని ఆ విధానం రద్దు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాకయ్య, కిరణ్, నాగన్న, రామ్మూర్తి, రాజమౌళి, సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.